అంతరపంటలతో అదనపు ఆదాయం


మామిడిలో అంతరపంటగా సాగు చేస్తున్న టమాట



తొప్పనపల్లె వద్ద మిరపలో అరటి, బొప్పాయిలో బంతి సాగు

- మామిడి తోటల్లో ఎక్కువగా అంతరపంటల సాగు
- ఒకే పంట కాలంలో రెండు, మూడు పంటలతో రెట్టింపు ఆదాయం
- తక్కువ భూములున్న రైతులకు లాభదాయకం
- తగ్గనున్న పంట పెట్టుబడి, కూలీల ఖర్చులు


మామిడిలో అంతరపంటగా వంగ

పలమనేరు: సాధారణంగా రైతులు తమ భూమిలో ఒక పంటను మాత్రమే సాగు చేయడం పరిపాటి. కానీ ఏక కాలంలోఒకే భూమిలో రెండేసి, మూడేసి పంటలను సాగుచేయడం ఇప్పుడు జిల్లాలో ఊపం దుకుంటోంది. ఒక పంటలో నష్టం వాటిల్లినా మరో పంట రైతును ఆదుకుంటోంది. ఇది ఒక విధంగా అదనపు ఆదాయంగా మారింది. ఈ కారణంగా అంతర పంటల సాగు వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటివరకూ కేవలం మామిడి తోటలున్న రైతులు ఏడాదికోసారి తోటను విక్రయించి ఆదాయం పొందుతున్నారు. అయితే రైతులు ఇప్పుడు మామిడి తోటలోనే ఏడాదికి మూడు కాయగూర పంటలను సాగు చేస్తున్నారు. ఫలితంగా మామిడి ఆదాయంతో పాటు అంతకు మూడు రెట్ల ఆదాయాన్ని అంతర పంటలతో పొందుతున్నారు.

మామిడి రైతులకెంతో మేలు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి విస్తీర్ణం 2.60 లక్షల ఎకరాలుగా ఉంది. ఇందులో నీటి సౌకర్యం ఉన్న తోటలు 80వేల ఎకరాలు. గత మూడేళ్లుగా మామిడితోటల్లో ఇతర పంటల సాగు క్రమేణా పెరుగుతూ ప్రస్తుతం 40 వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగుచేస్తున్నట్టు ఉద్యానవనశాఖ చెబుతోంది. మామిడిలో అంతర పంటలుగా బీన్సు, టమాట, వంగ, బెండ, పసుపు, మిరప..ఇత్యాది వాటిని అంతర పంటలను పండిస్తున్నారు. పప్పు ధాన్యాలైన అలసంద, జీలుగ, పెసర, మునగలతో పాటు తక్కువ వ్యవధి పంటలైన ఆకుకూరలను సైతం సాగుచేస్తున్నారు.

సాధారణ పంటల్లో ఇదీ కాంబినేషన్

బొప్పాయిలో బీన్సు, కొత్తిమీర, ధనియాలు, వెల్లుల్లి, మిరపలో అరటి, టమాటలో కాకర, దోస, తీగ బీన్సు, దోస, బీర మొదలైన వాటిని సాగుచేస్తున్నారు. బంతిపూలలో దోస, కొత్తిమీర, బెండ, బీన్సు, టమాట, వంగలో బంతి, టమాటలో కాకర లాంటి కాంబినేషన్లు రైతులకు లాభసాటిగా మారాయి. కొందరు రైతులు బొప్పాయిలో బంతి, మిరపలో అరటి, బంతిలో అలసంద, క్యాబేజిలో వెల్లుల్లి, కొత్తిమీర సాలుపంటగా జొన్నలను పండిస్తున్నారు.

ఈ విధానాలతో బహుళ ప్రయోజనాలు

పంట సాగుకు అవసరమైన భూసారానికి సేంద్రియ ఎరువులు, నీటి వినియోగం, కూలీలు, క్రిమి సంహారక మందుల ఖర్చు తగ్గుతుంది. ముఖ్యంగా పంటకాలం ఆదా అవుతుంది కాబట్టి ఏటా మూడు పంటల్లో రెండు, మూడు పంటలను మిశ్రమ, అంతర పంటలుగా సాగుచేసుకోవచ్చు. దీంతో ఒక పంటకు ధర తగ్గినా మరో రెండు పంటలకు ధరలుండే అవకాశం ఉంటుంది. ఫలితంగా రైతుకు నష్టాలు రావు. అందుకే రైతులు విభిన్నంగా ఆలోచించి మిశ్రమ పంటలవైపు దృష్టి సారించారు.

టమాట రైతులకు ఇదో వరం

పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో టమాట ఎక్కువగా సాగవుతోంది. అయితే వీటి ధరలు ఇప్పుడు బాగానే ఉన్నా ఏ సీజన్‌లో ధరలెలా ఉంటాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఎకరా పొలంలో టమాట సాగు చేసేందుకు దాదాపు రూ.80వేలు వ్యయం చేయాల్సి ఉంటుంది. పంట దిగుబడి మధ్యలో ఉన్నప్పుడు ఇదే పొలంలో తీగ పంటలైన బీన్సు, బీర, కాకర, సొర లాంటి వాటిని సాగుచేస్తే టమాట పంట ఒడగ్గానే అదే కర్రలకు రెండో పంట తీగలను పెట్టుకోవచ్చు. ఫలితంగా పంట పెట్టుబడి తగ్గడంతో పాటు భూమిని కొత్త పంటకు సిద్ధం చేసే ఖర్చు కూడా తగ్గుతుంది. టమాట పంటలో ధర లేనప్పుడు నష్టాన్ని చూసే రైతులకు రెండో పంట ఆసరా ఉంటుంది.

మామిడితోపాటు కూరగాయల పంటలతో లాభం



గతంలో ఒకే పంటను సాగుచేసేవాళ్లం. దాంట్లో నష్టం వస్తే ఇబ్బందులు పడేవాళ్లం. అందుకని మామిడి చెట్లను పెంచాం. ఆ తోపులో రకరకాల కూరగాయలతో పాటు బంతి, చామంతి లాంటి తక్కువ పంట కాలం ఉన్నవాటినీ సాగుచేస్తున్నాం. దీంతో మామిడి ఆదాయంతోపాటు రెండు, మూడు పంటల ఆదాయం పొందుతున్నాం. ముఖ్యంగా అన్ని పంటలకు అవే నీరు, అంతే ఎరువులు, కూలీల బాధ చాలా వరకు తగ్గింది.

–గజేంద్ర, రైతు, తొప్పనపల్లె

మారిన రైతుల ఆలోచన సరళి



అంతర పంటలుగా కూరగాయలు, పూలు.. ఇలా వేటినైనా భూమిలో అదే సత్తువతో సాగు చేయవచ్చు. ప్రత్యేకించి అధికంగా ఎరువులు వేయాల్సిన అవసరం లేదు. రెండు, మూడు రకాల పంటలున్నపుడు రైతులను ఏదో ఒక పంట ఆదుకుంటుంది. అన్నిటితో అధికంగా ఆదాయం కళ్లజూసినా ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. తక్కువ ఖర్చుతో సాగు చేస్తూ నాలుగురకాల ఆదాయాన్ని పొందవచ్చు. ఇప్పుడు రైతులు ఆలోచన సరళి మారింది. అంతర పంటల సాగువైపు పయనిస్తుండటం ఇదో మంచి పరిణామం.

–డాక్టర్ అన్నపూర్ణదేవి, ఏడీ, అగ్రికల్చర్, పలమనేరు

క్లుప్తంగా

‘వర్గీకరణ’కు మద్దతుపై హర్షం


మాట్లాడుతున్న నరేంద్రబాబు

పుంగనూరు: ఎస్సీ వర్గీకరణ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ప్రకటించడం ఆనందదాయకమని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు నరేంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఎంఎస్‌పీ నాయకులు మాటూరి మురళి, నరసింహులు, నాగభూషణంతో కలసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. నరేంద్రబాబు మాట్లాడుతూ, ఎంతోకాలంగా ఎస్సీ వర్గీకరణ అంశంపై పోరాటం చేస్తున్నామని, ఇకనైనా న్యాయం చేసి బడుగులకు మేలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ నాయకులు వెంకట్రమణ, సదుం వెంకట్రమణ, ప్రభాకర్, చౌడేపల్లి ప్రభాకర్, హరిబాబు, గోవిందు, రవి, హరి, పులిచెర్ల హరిబాబు పాల్గొన్నారు.

హెచ్‌ఎం సేవలు వెలకట్టలేనివి


హెచ్‌ఎం దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

బైరెడ్డిపల్లె: విద్యార్థుల భవితకు బాటలు వేయడంతోపాటు పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన హెచ్‌ఎం విశ్వనాథయ్య సేవలు వెలకట్టలేనివని డీవైఈఓ చంద్రశేఖర్ అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథయ్య ఉద్యోగ విరమణ పురస్కరించుకుని బుధవారం ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడారు. హెచ్‌ఎం సేవలను ప్రస్తుతించారు. విశ్వనాథయ్య దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు సుబ్రమణ్యం, వేణుగోపాల్‌రెడ్డి, సాయిలీల, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న డీవైఈఓ

బైరెడ్డిపల్లె: మండలంలోని ప్రైవేటు పాఠశాలలను బుధవారం డీవైఈఓ చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల తరగతి గదులు, విద్యార్థుల హాజరు సంఖ్య, టాయిలెట్స్ నిర్వహణ, ఉపాధ్యాయుల పనితీరుపై ఆరా తీశారు. విద్యాబోధనలో ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా విద్యాబోధన చేయాలన్నారు. విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

సీఎంకు సాదర వీడ్కోలు


ప్రజలకు అభివాదం చేసి తిరుగు ప్రయాణమవుతున్న సీఎం చంద్రబాబు

కుప్పం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజుల కుప్పం పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణంలో అధికారులు, నాయకులు సాదర వీడ్కోలు పలికారు. కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల ప్రాంగణంలో పార్టీ కార్యకర్తల సమావేశం అనంతరం అక్కడే కళాశాల ప్రాంగణంలోని హెలిప్యాడ్‌కు చేరుకుని బెంగళూరుకు తిరుగు ప్రయాణమయ్యారు. వీడ్కోలు పలికిన వారిలో రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సమిత్ కుమార్, జిల్లా ఎస్పీ మణి కంఠ చందోలు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, మురళీమోహన్, భానుప్రకాష్, స్థానిక నాయకులు పీఎస్ మునిరత్నం. డాక్టర్ సురేష్ బాబు తదితరులు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ హర్షం

పుంగనూరు: రాష్ట్రంలో అంబేడ్కర్ విదేశీ విద్య పేరును ప్రతిపాదించిన ప్రభుత్వానికి ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో నాయకులు శ్రీనివాసులు, మహేంద్ర, రాజు, అశోక్, వెంకట్రామయ్య తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

డయేరియాపై అవగాహన ర్యాలీ

యాదమరి(పూతలపట్టు): మండలంలోని కీనాటంపల్లె గ్రామస్తులకు సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌ఓ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డయేరియా బారిన ప్రజలు పడే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. వర్షాకాలంలో నీళ్లు కలుషితమవడంతో దోమలు పెరిగి వాటి వల్ల డయేరియా సోకుతుందన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ దిల్షాద్, మహిళా ఆరోగ్య కార్యకర్త అమ్ములు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలపై వీధికుక్కల దాడి

పుంగనూరు: వీధికుక్కల దాడిలో ఇద్దరు మహిళలు గాయపడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలు..పట్టణానికి చెందిన కనకమ్మ(60), యశోదమ్మ(67) పట్టణ సమీపంలోని గూడూరుపల్లె వద్ద జగనన్న కాలనీలలో ఇంటి కూలీ పనులకు వెళ్లారు. పనులు చేస్తుండగా వీధి కుక్కలు వచ్చి వారిపై దాడిచేసి కరవడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎస్‌ఐలు బాధ్యతల స్వీకరణ


నరేష్


శాంతిపురం: రాళ్లబూదుగూరు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఐ.నరేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లాలో అవినీతి నిరోధకశాఖ ఎస్‌ఐగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఎస్‌ఐగా ఉన్న వి.సుమన్‌ను చిత్తూరు వీఆర్‌కు బదిలీ అయ్యారు.

గుడుపల్లెలో శ్రీనివాసులు..


శ్రీనివాసులు

గుడుపల్లె: గుడుపల్లె ఎస్‌ఐగా శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ లక్ష్మీకాంత్ బదిలీపై చిత్తూరు వీఆర్‌కు వెళ్లిపోవడంతో ఆయన స్థానంలో శ్రీనివాసులు నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ, శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు.

నేడు జ్ఞానదీపాలు పుస్తకావిష్కరణ



పలమనేరు: స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ముద్రించిన జ్ఞానదీపాలు పుస్తకాన్ని చిత్తూరులో గురువారం ఆవిష్కరించనున్నట్టు సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలల్లో నిర్వహించే ప్రార్థనలో విద్యార్థులకు ఉపయోగపడే నీతిపద్యాలు, సూక్తులు, సామెతలు, ప్రార్థనా గీతాలు ఇందులో ఉన్నాయని తెలియజేశారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి


పుంగనూరు: ర్యాలీ నిర్వహిస్తున్న సెబ్ సీఐ భాగ్యలక్ష్మి తదితరులు



పులిచెర్ల(కల్లూరు): కళాశాల విద్యార్థులతో నిర్వహిస్తున్న ర్యాలీ

పుంగనూరు: సమాజంలో యువత ఎక్కువగా మాదకద్రవ్యాలకు బానిస అవుతోందని, వీటికి దూరంకాకపోతే భవిష్యత్తు కోల్పోతారని సెబ్ సీఐ భాగ్యలక్ష్మి హెచ్చరించారు. మాదక ద్రవ్యాల నిషేధిత దినోత్సవం పురస్కరించుకుని బుధవారం విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. సెబ్ సీఐ మాట్లాడుతూ, డ్రగ్స్‌ను నిషేధిస్తూ ప్రభుత్వం చట్టాలు రూపొందించిందని, ఎవరైనా వీటిని వినియోగించినా, విక్రయించిన కేసులు నమోదు చేసి, అరెస్ట్ చేస్తామన్నారు. అలాగే మాదక ద్రవ్యాలకు బానిసలైన వారిని వాటిని నుంచి విముక్తి కల్పించేందుకు అడిక్షన్ సెంటర్లు ఉన్నాయన్నారు. యువత మత్తుకు బానిసలు కాకుండా భవితకు బాటలు వేసుకోవాలని, సమాజానికి ఉపయోగపడేవారుగా కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ దయానందరాజు, ఎస్‌ఐ సుబ్బారెడ్డి, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తుమందులకు బానిసలు కావొద్దు

పులిచెర్ల(కల్లూరు): మత్తు మందులకు ఎవరూ బానిసలు కారాదని పులిచెర్ల పోలీస్‌స్టేషన్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ పి.శ్రీనివాసమూర్తి అన్నారు. అంతర్జాతీయ మత్తు మందు, మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని నందవనం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మత్తు వ్యసనాలు యువత జీవితాలను నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. మత్తు మందు వాడినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ తులసీరాం, అధ్యాపకులు అశోక్ కుమార్, హేమావతి, హేమలత, లావణ్య, పోలీసు సిబ్బంది చైతన్య, రమేష్, మహేష్, అమ్మాజీ పాల్గొన్నారు.


పలమనేరు: మాట్లాడుతున్న న్యాయవాది ఇస్మాయిల్

పలమనేరులో..

పలమనేరు: యువకులు మత్తు పదార్థాలకు బానిసలు కారాదని పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది ఇస్మాయిల్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మాదకద్రవ్యాల కారణంగా సమాజంలో క్రైమ్ రేట్ పెరుగుతోందన్నారు. మాదక ద్రవ్యాలు చివరకు ఆరోగ్యాన్ని దెబ్బతీసి కుటుంబాలను వీధిన పడేస్తాయనేది గుర్తెరగాలన్నారు. మత్తు పదార్థాల వాడకం వల్ల చిన్న మెదడు రక్తనాళాలు దెబ్బతిని మరణానికి దారితీస్తుందని, ఫలితంగా వారిపై ఆధారపడిన కుటుంబాలు అతలాకుతలం అవుతాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని యువత వాటికి దూరంగా ఉండాలని హితవు పలికారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు ఏం చేస్తున్నారు? ఎక్కడెక్కడ తిరుగుతున్నారో ఓ కంట కనిపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు భాస్కర్, ఆరీఫుల్లా, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో మధు, శ్రీవాణి విద్యార్థుల ప్రతిభ


మధు, శ్రీవాణి కళాశాల విద్యార్థినులు చేతన, కరిష్మా, అల్బీన్, ఫిజా అంజుమ్


శ్రీచైతన్య విద్యార్థులు యమున, మోహన్‌కుమార్, సుమయ, గుణశేఖర్

పలమనేరు: బుధవారం వెలువడిన ఇంటర్ తొలి సంవత్సరం ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో పట్టణానికి చెందిన మధు, శ్రీవాణి కళాశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాళ్లు క్రిష్ణమూర్తి రెడ్డి, సీపీ శ్రీవాణి తెలిపారు. ఎంపీసీలో చేతన, కరిష్మా 470/466, బైపీసీలో అల్బీన్ 440/436, సీఈసీలో ఫిజా అంజుమ్ 500మార్కులకు 486 సాధించి టాపర్లుగా నిలిచినట్టు పేర్కొన్నారు. కళాశాలలకు చెందిన 105మంది విద్యార్థులు 400 కంటే ఎక్కువ మార్కులను సాధించినట్టు తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

శ్రీ చైతన్యలో..

పట్టణంలోని సాయిబాబా ఆలయం వద్ద నున్న శ్రీచైతన్య విద్యార్థులు ఇంటర్ అడ్వాన్స్ పరీక్షల్లో మంచి మార్కులను సాధించినట్టు కళాశాల కరస్పాండెంట్ ఎంవీఆర్ రెడ్డి, ప్రిన్సిపల్ ప్రమోద్ కుమార్ తెలిపారు. ఎంపీసీ గ్రూపులో యమున 466, బైపీసీలో మోహన్‌కుమార్ 435, సీఈసీలో సుమయ 488, ఎంఈసీలో గుణశేఖర్ 463 మార్కులను సాధించి టాపర్లు నిలిచారని పేర్కొన్నారు. విద్యార్థులను, అధ్యాపకులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

విత్తే ముందు విత్తనశుద్ధి చేయాలి


టి.పుత్తూరులో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

తవణంపల్లె: రైతులు వేరుశనగ విత్తే ముందు విత్తనశుద్ధి చేయాలని వ్యవసాయశాఖ ఏడీ ఉమ సూచించారు. బుధవారం మండలంలోని టి.పుత్తూరులో సాగులో ఉన్న వేరుశనగ పంటను, వేరుశనగ విత్తనాలు విత్తడాన్ని పరిశీలించి రైతులకు తగిన సూచనలు, సలహాలిచ్చారు. రైతులు పంట చుట్టూ జొన్న, మొక్కజొన్న వేయాలన్నారు. వీటి వల్ల రసం పీల్చే పురుగుల నుంచి పంటను కాపాడువచ్చునని పేర్కొన్నారు. వేరుశనగలో అంతరపంటగా 7 లేక 9 వరుసలకు కంది పంట సాగు చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా పురుగులు నియంత్రణ కోసం ఆముదపు గింజలు నాటడం మంచిదన్నారు. ఏడీతో పాటు తవణంపల్లె వ్యవసాయాధికారి ప్రవీణ్, సచివాలయ ఉద్యాన శాఖ అసిస్టెంట్ శ్రీధర్, రైతులు పాల్గొన్నారు.

మెగా ఫుడ్ పార్క్‌లో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న సిబ్బంది

పలమనేరు: పట్టణ సమీపంలోని శ్రీని ఫుడ్స్‌లో పాడరన్ ఫుడ్స్ సిబ్బంది బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 40మంది రక్తదానం చేశారు. వారి నుంచి జిల్లా ఆస్పత్రి అధికారి డాక్టర్ వీర అమరనాథ్, సిబ్బంది రక్తాన్ని సేకరించి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మొగిలి ఘాట్‌లో తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తుంటాయని, ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి రక్తం అత్యవసరం కాబట్టి మానవతా దృక్పథంతో ఈ శిబిరం ఏర్పాటు చేసినట్టు తీర్థపతి, టీల్లో నిత్యానంద్, మధుసూధన్‌రెడ్డి తదితరులు తెలిపారు. కార్యక్రమంలో సీజీ, సుమేరు, సామ్ అగ్రి ప్రొడక్ట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పటాలమ్మ గంగజాతర


అమ్మవారి శిరస్సు ఊరేగింపు


అమ్మవారికి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు

- అంగరంగ వైభవంగా శిరస్సు మెరవణి
- జాతరకు పోటెత్తిన జనం

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేటలో పటాలమ్మ గంగమ్మ జాతర బుధవారం వైభవంగా నిర్వహించారు. దేదీప్యమైన కాంతులతో అమ్మవారు బుధవారం తెల్లవారుజాము నుంచి భక్తుల దర్శనార్థం కొలువు దీరారు. శిరస్సు మెరవణి అనంతరం అమ్మవారిని విశ్వరూప దర్శనానికి ఉంచారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడుకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

భక్తిప్రపత్తులతో శిరస్సు మెరవణి

అమ్మవారి శిరస్సు మెరవణి మంగళవారం అర్ధరాత్రి గ్రామ శివారులోని మారెమ్మ ఆలయం నుంచి ప్రారంభమైంది. మంగళ వాయిద్యాల నడుమ బజారు వీధి, రాములవారి గుడి వీధి మీదుగా సాగి గ్రామ చివరన పలమనేరు రోడ్డులోని ముత్యాలమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారిని ఆశీనులు చేశారు. ఊరేగింపులో ప్రతి ఇంటా అమ్మవారి శిరస్సుకు హారతులిచ్చి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాణసంచా, సౌండ్ సిస్టం, లైటింగ్ అందరినీ ఆకట్టుకుంది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్దపంజాణి పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

అంబలి సమర్పణ

అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన అంబలి సమర్పణకు పెద్దసంఖ్యలో గ్రామస్తులు తరలివచ్చారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పెద్ద డ్రమ్ములో భక్తులు తమ ఇళ్ల నుంచి తీసుకువచ్చిన అంబలిని పోసి మొక్కులు చెల్లించారు. కొందరు భక్తులు అంబలిని తమ నివాసాలకు తీసుకెళ్లారు.


ఆకట్టుకున్న భక్తుల వేషధారణలు

నేడు జలధి

రెండు రోజుల గంగమ్మ జాతర గురువారం ఉదయం జలధితో పరిసమాప్తం కానుంది. అమ్మవారి విశ్వరూప దర్శనం అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా వేడుకలతో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామ శివారులో జలధి కార్యక్రమం నిర్వహిస్తారు. భక్తులు విరివిగా పాల్గొని జలధి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.


అమ్మవారి విశ్వరూప దర్శనం

వైభవంగా గంగజాతర

బైరెడ్డిపల్లె: మండలంలోని చీలంపల్లెలో బుధవారం వైభవంగా గంగజాతరను నిర్వహించారు. గ్రామ పొలిమేరల్లో మంగళవారం రాత్రి అమ్మవారి శిరస్సుకు ప్రత్యేకపూజలు చేసి ఊరేగించారు. బుధవారం ఉదయం ఆలయం వద్ద ప్రతిష్టించారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

కోలాహలం.. నిమజ్జనం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం టాప్‌లైన్‌లో బుధవారం సాయంత్రం గుండాలమ్మ నిమజ్జనాన్ని అట్టహాసంగా నిర్వహించారు. విశేష పూజలు చేసి అమ్మవారిని స్థానిక వీధుల్లో డప్పు వాయిద్యాల హోరు నడుమ ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.